# మల్లె మొగ్గ

**తూ**ర్పు పడమరలను కలుపుతోన్నట్టు పొడవైన కాలవ. కాలవ ఈవల ఒడ్డు పొడుగునా సిమెంటు రోడ్డు. కాలవలో తెరచాపలెత్తుకొని పరిగెత్తే పడవలకి సిమెంటు రోడ్డుమీద పరుగెత్తే కారులు లారీలకి పోటీ.

కడియం దగ్గర కాలవకడ్డంగా పెద్ద వంతెన, వంతెన దాటితే కడియపులంక బుర్లంకలకు పోయే ఎర్రకంకరరోడ్డు, రోడ్డు కిరుపక్కలా నర్సరీలు-రంగు రంగుల గులాబీతోటలు, గుబురుగాపెరిగిన చెట్లు. సందిడికి లొంగని పనసకాయలను మోస్తున్న పనసచెట్లు, అరటితోటలు, పందిరిలా అలుముకున్న మామిడి తోటలు, ఇంద్ర ధనస్సులా మెరిసే రకరకాల క్రోటన్సులు.

అక్కడే వాటిమధ్య పనిచేసేవాళ్ళకి ఆ వాతావరణం ఎలా వుంటుందో తెలీదుగాని, ఎప్పుడేనా అటు వెళ్ళిన వాళ్ళకి ఆ పరిసరాలు వదిలి రాబుద్ధి కాదు.

కడియపులంక దగ్గరౌతోన్నకొద్ది మల్లితోటలు ముమ్మరంగా అగుపిస్తాయి.

నింగి ముచ్చటపడి ఆకుపచ్చరంగు చీర సింగారించుకొని నేలమీద వాలినట్లున్న విశాలమైన మల్లితోటది. దట్టంగా మొగ్గతొడిగింది. అక్కడక్కడ విరిసిన మల్లెలు చుక్కల్లా మెరుస్తున్నాయి. విరిసిన మల్లెల

మీంచి వీచే చిరుగాలి సువాసనలను పులుముకుని దారిపోయే వాళ్ళకి గిలి గింతలు పెడుతోంది. లంకల నుంచి వచ్చిన కన్నెపిల్లల దండు తోట మధ్యనుంచి వున్న గట్టునే నడచి మోటారు షెడ్ దగ్గరికి చేరింది. షెడ్ లోంచి చినకాపు బయటకొచ్చి "తక్కినోళ్ళేరే?" అన్నాడు.

"అందరికి మేఁవ్ దారం కట్టావేఁటి?" అంది సీత.

"యిది బొత్తిగా సిసీంద్రీ అయిపోతంది. యేవేరత్తనం. తతిమ్మా వోళ్ళు వత్తన్నారా!" అన్నాడు చిన్నకాపు.

"వత్తారులెండీ ముందు మా మున్ఁవ్ యిడదీసి మాకిచ్చెయ్యండి మేఁవ్ కోత మొదలెడతాం" అంది రత్నం.

చినకాపు పంచాయితీ బోర్డు మెంబరు నరసయ్యగారబ్బాయి, దోర వయసువాడు, ఊళ్ళోని అందగాళ్ళలో ఒకడు. చేసేది పొలంపనే అయినా ఎప్పుడూ మల్లిపూవులాంటి తెల్లని గ్లాస్కోపంచి, మీగడ తరకలాంటి సిల్కుచొక్కా తొడుక్కుంటాడు. బురదలోకి దిగకుండా వ్యవసాయం చేయించుకునేటంత ఆస్తి గలవాడు గాబట్టి అతనికలా సరిపోతుంది.

"సరే పదండే" అని తోట పొడవునా పదేసి వరసలవంతున ఒకో మున్ఁవ్ ఏర్పాటుచేసి ఒక్కొక్కళ్ళకే యిచ్చాడు.

వాళ్ళు మొగ్గలు కోయడం మొదలెట్టారు.

నూనెకు ముఖం వాచిన రుప్పతలలు, చిరిగిన జాకెట్లు, కచ్చా పోసిన మొద్దు పరికిణీలు ఆ మల్లెమొక్కల వరసల మధ్య నడుములు వంచి కదులుతున్నాయి. ఆ పిల్లల వేళ్ళు నేర్పుగా గింజలేరుకునే పిచుక ముక్కుల్లా ఏపుగా ఎదిగిన మల్లిమొగ్గల్నే కోస్తున్నాయి. ఎదగని పిందె మొగ్గల్ని విరిసిన పువ్వుల్ని వదిలేస్తున్నాయి. ఒకోపిల్ల విరిసినపువ్వుల్ని తుడిమి చింపిరితలలో ముడుచుకుంటోంది. వంచిన నడుం ఎత్తకుండా. ఓ చేయి మోకాలుమీద ఆన్చి, మరోచేత్తో మధ్య మధ్య చింపిరి జుట్టును ఎగదోసుకుంటూ మొగ్గల్ని తుంపి వడిలో పోసుకుంటూ ముందుకు పోతు

న్నారు వాళ్ళు. మధ్య మధ్యనడుంలాగి ఒకోసారి నిలబడి వళ్ళు విరుచుకునిమళ్ళీ వంగి కోత మొదలెడుతున్నారు.

మోటారు షెడ్ దగ్గర నిలబడిన చినకాపు. అప్పుడప్పుడు ఒక్కొక్కళ్ళ మునుంలోనే నడిచి "ఏయ్ పిల్లా! మొగ్గనొదిలేత్తన్నావ్. రేపటికి పువ్వులెందుకూ పనికిరాకుండా పోతాయ్ యిలాకోత్తె నీకు మొగ్గలెక్కెట్టను మరి" అంటూ పువ్వుకోసే పిల్లల్ని గదమాయిస్తున్నాడు. అందులో ఓ పిల్ల ఎక్కడో "ఓ మొగ్గ సెయ్ తాటిపోతే, అంతలోకే సణగాలేంటి?" అని బుంగమూతి పెట్టి కోపంగా చూచింది.

"సరిసర్లే కానియ్" అని ముందుకు సాగాడు చినకాపు.

"యేవే సీతా! నీ మునుంవ్‌లో పిందికూడా అపడ్డంలేదు. మొత్తం తుంపేత్తన్నావేటి ?"

"మరే బాగా కోత్తేనేమో మొత్తం తుంపేత్తన్నావా-అంటావ్. మొగ్గ వుండి పోతేనేమో వదిలేత్తన్నావా?-అంటావ్. నిన్నెవత్తి కట్టుకుంటాదో కాని నీతో యాగటం కట్టవే."

"ముదిపేరక్క మా బొమ్మలా మాటాడతాది. దీనితస్సాదియ్యా" అని షెడ్ దగ్గరకు వెళ్ళిపోయాడు చినకాపు.

సూర్యోదయానికి ముందువచ్చి కోతమొదలుపెట్టిన ఆ పిల్లలు పదకొండు గంటలవరకు పూలుకోసి. షెడ్ దగ్గరికి రారు, అక్కడ పరచివున్న తడిచాపమీద ఒక్కొక్కళ్ళే వడిలోని మొగ్గల్ని దిమ్మరపోసారు. దోసడు దోసడు మొగ్గల్ని తిరిగి ఆ పిల్లల ఒళ్ళల్లో పోసాడు చినకాపు. అ మొగ్గలట్టుకుని ఎవరి యిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు పిల్లలు,

మల్లెలకాలంలో ఇది నిత్యం జరిగే సంగతి,

సాయంత్రపువేళ ఒక్కొక్కపిల్లే ఆ మల్లిమొగ్గల్ని ఓ చిన్న జంగిట్లో పోసుకుని వాళ్ళవాళ్ళ వీధిల్లో అమ్ముకుంటారు.

వేసవి రాత్రికి పండువెన్నెల మల్లిమొగ్గలు లేనిదే నిండుతనం వుండదేమో అందుకే ఏ మాత్రం సాగున్న యిల్లాలైనా ఆ రోజులలో మల్లిమొగ్గలు కొని తీరుతుంది.

మల్లిమొగ్గలు కోసే ప్రతిపిల్లా ఆ రోజులలో అలా ఏభై అర వై పైసలు సంపాదిస్తుంది.

నిజానికి ఆ పిల్లలు కూలీపిల్లలు కాదు. అటు మధ్యతరగతికి అందుకోలేక, యిటు తెగించి కూలీపని కెళ్ళలేక మధ్యలో సతమత మయ్యే మరీ చిన్న సంసారాల్లోని పిల్లలు వాళ్ళంతా. అందుకే ఆ వయసు పిల్లలు, కొంతలోకొంత గౌరవంగా సంపాదించిన ఆ డబ్బుల్ని చన్నీ ళ్ళకి వేడినీళ్ళలా ఆసంసారాలు వాడుకుంటాయి. ఇంకో రెండుమూడేళ్ళు పోతే ఆ పిల్లలే విరిసిన పూవులై పెళ్ళిళ్ళు చేసుకుని యింక బయటికి రారు. మగవాడి నీడలో తినో తినకో బతుకుతారు.

అందరి పిల్లల్లాగే సీతా అమ్ముతుంది మల్లిమొగ్గలు. కాని సీత ఎక్కువగా తిరిగి అమ్మనక్కర్లేదు. సీత వీధిలోని పెద్దరుగుల లోగిలి వాళ్ళే సీత మొగ్గలన్నీ కొనేస్తారు. ఆ పెద్దరుగులవాళ్ళకంతా వూడుపు చేనే వుంది. వాళ్ళకి మల్లితోట లేదు. కాని వాళ్ళ పాప ఆరోజుల్లో రోజూ పూలజడ వేసుకుంటుంది. పాప అమ్మ నిత్యం కనకాంబ్రాలు' మల్లెలు కలిపి అల్లిన మాలని శిఖనిండా చుట్టుకుంటుంది.

అప్పుడప్పుడు పాప పూలజడ చూసి, తనూ అలాటి జడ వేసు కోవా లేప్పుడేనా అని సరదాపడేది సీత మనసులోనే.

మళ్ళింతలోనే "తను జడవేసుకోవడమే నాలుగైదురోజులకోసారి గాని కుదరదు. ఏ వాసననూనెలు రాయకపోయినా తనది చమ్మకాయలా భారీ జడ. దానికే అమ్మ చాలీచాలకుండా రాస్తుంది నూని. ఇంక పువ్వు లన్నీ జడలో సింగారించుకుంటే నూనెలా వస్తుంది?" అని వయసుకు మించి ఆలోచించుకుని సరిపెట్టుకుంటుంది.

అక్కడికీ మనసుతీరక బాగా విరిసిన మొగ్గల్ని ఏ పొట్లాలదారం తోటో బిక్కచిక్కిన మాలకట్టి ఆ రుప్పలాంటి తలలోనే ముడుచుకుంటుంది సీత. సీతేకాదు, సీతలాంటి ఆ పిల్లలు చాలామంది అంతే.

తోటదగ్గర చాపమీద పోగైన మొగ్గల్ని బుట్టలోకెత్తి, నీళ్ళుజల్లి దగ్గరలోవున్న పట్టణాలకి, పొరుగూర్లకి బస్సులమీద సైకిళ్ళమీద పంపేస్తాడు చిన్నకాపు,

అలా ప్రతి మల్లెలకాలంలోను పూసిన మొగ్గలన్నీ ఆ కన్నెపిల్లల చిన్నారివేళ్ళ కోస్తాయి. ఆ మొగ్గలన్నీ బుట్టల్లో కిక్కిరిసి ఎక్కడికో పోతాయి. రాతివిగ్రహాల శిరస్సులనో, మెడలనో కొత్త దంపతుల పాన్పుమీదనో యిల్లాలి సిగలోనో వెలయాలి వయ్యారంలోనో, సరసుని ముంజేతినో వాడి మరునాటికి పెంటపోగులోకి చేరతాయి.

కాని ఆ పూలపిల్లల తలలు నూనెకి పూలకి ఎదురుచూస్తూనే వుంటాయి.

ఓనాడు సీతతల్లి రత్తమ్మ తీరుబడి చేసుకొని, సీతను ముందు కూర్చోబెట్టుకుని, తలకి నూనెరాసి, చిక్కుతీసి జడలేస్తోంది. జడ పూర్తి కావస్తోంది.

"అమ్మా" అంది సీత గారాబంగా.

"ఊఁ" అంది రత్తమ్మ నూలుతాడు జడ చివర ముడివేస్తూ.

"మల్లెపూల జడేసుకోవాలనుందే"

"అయ్యో సోద్దెం యిప్పుడు పూలజడెందుకే? పెళ్ళనా కార్యం అనా ?

"పెళ్ళికేకాని యేసుకోరేటి పూలజడ?"

"లేకపోతే రోజూ పూలజడేసుకుని పల్లకీఎక్కి వూరేగుతావేటి?" అంది రత్తమ్మ జడను సాపుచేస్తూ.

"మరట్టాగైతే మన పెద్దరుగులింటి పాప నాకంటిసిన్నది రోజూ యేసుకోటం లేదేటి? సీత బిక్కమొగంపెట్టి అంది. రత్తమ్మమనస్సు చివుక్కుమంది. తలమీద చేయివేసి నిమురుతూ, "ఆళ్ళు సాగునోళ్ళ

ళ్ళమ్మ, మీ అయ్య బతికుంటే, నీకూ పూలజడేసేదాన్నే, నువ్వు పూల జడేసుకుంటే నాకు మాత్రం సూడాలనిలేదా అమ్మ, మనకి సాగకకాని" అంది రత్తమ్మ జాలిగా.

అలా రత్తమ్మ మాట్లాడడంతో సీత మరికాస్త గాబానికిపోయి, "మొగలు నేనే తెత్తాను కాదంటె. ఓ సాలు పూల జడయ్యేమ్మా' అంది గోముగా,

"చూడమ్మా? నీకింకా తెలియని తనం. నువ్వు మొగలమ్మితే రోజూ ఓ అర్ధరూపాయి డబ్బులొత్తన్నాయి. తమ్ముడు సదువుకుంటానే రోజూ సందాలమాటు గేదని మేపుకొత్తన్నాడు. నేసేది కూలిపనే ఐనా మీ మామయ్య ఎవరోన్ని ఒకర్నడిగి అప్పుడప్పుడు ఓ మోపుగడ్డేత్తన్నాడు. ఆ గేది పాలమ్ముకుంటా వుంటే రోజూ రెండో మూడో వత్తన్నాయి. నువ్వట్టుకొచ్చిన డబ్బులు ఆ పాల డబ్బుపెట్టి యీదినపడకుండా రోజులు చింపుకొత్తన్నాం. నేను కూలిపనికెడదావంటె మనోళ్ళలో ఆ రివాజులేదు. మిమ్మల్నిద్దరినీ నాకొదిలేసి మీ అయ్య ఎల్లిపోయాడు. మీ అయ్యేవుంటే నీకెన్ని ముద్దు ముచ్చట్లు తీరిసేవాడో. పోనీలే అమ్మా నీ సరదా నేనెందుకొద్దనాలి? యీపాలి జడేసినప్పుడు నువ్వు తెచ్చుకున్న మొగలతో ఎంత జడొత్తె అంతజడే పల్చగానేనా యేసుకుందువుగాని" అంది రత్తమ్మ యింటి భారాన్ని కన్నకూతురుతో చెప్పడంలో అప్పటికే రత్తమ్మగొంతు జీరవోయింది. కళ్ళు చెమ్మగిలి ఓ నీటిబొట్టు సీత భుజంమీద రాలింది.

సీత పులిక్కిపడి వెనక్కితిరిగి తల్లిముఖం చూసింది. రత్తమ్మ కళ్ళను పమిటకొంగుతో వత్తుకుంది.

సీత మెల్లగా అంది — "పూలజడొద్దులే అమ్మ, పెళ్ళికే యేసుకుంటాను."

రత్తమ్మ సీతని గుండెల కదుముకుంది.

నాలుగు మల్లెపూల కాలాలు గడిచిపోయాయి. చిన్నకాపు మరో రెండెకరాల మల్లెతోటని వున్నతోటకి కలిపాడు. ఓ పంచాయితీ ఎలక్షన్ జరిగింది. పాత ప్రెసిడెంటే మళ్ళీ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యాడు.

చినకాపు తండ్రి నరసయ్య ఈసారి వైస్‌ప్రెసిడెంటు అయ్యాడు. పూలుకోసే పిల్లలు అలాగే అవే చింపిరితలలతో మొగ్గకోతకి వస్తున్నారు. చిన్నకాపుకి పెళ్ళయ్యింది.

సీత వరదొచ్చిన నదిలా నిండుగా తయారయింది. ఓణీలు వేసుకుంటోంది. జాకెట్టు కాస్త చిరిగినా, బట్టలు బాగోకపోయినా బయటికెళ్ళడానికి సిగ్గుపడుతోంది. తల నాలుగైదురోజులకోసారి నూనిరాసి దువ్వుకున్నా, రోజూ పైపైన దువ్వెనతో దువ్వుకుంటోంది. ఇంకా పెళ్ళి కాకపోవటంతో అందరితోపాటే పూలకోతకి వెడుతోంది. కాని సీత యీడువాళ్ళు కొంతమంది పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళకి వెళ్ళిపోయారు. సీతతో ప్రస్తుతం ఎక్కువమంది కొత్తపిల్లలు మొగ్గకోతకి వస్తున్నారు.

రత్తమ్మకి యిప్పుడు రెండు గేదెలున్నాయి. ఒకయింట పుట్టిన పెయ్యని మేపి గేదెని చేసింది రత్తమ్మ. ఆ గేదెని నాలుగొందల కడుగుతున్నారు. ఆ గేదెనమ్మి సీత పెళ్ళిచెయ్యాలని రత్తమ్మ కలలు కంటోంది సీత మేనమామ సంబంధాలు వెతుకుతున్నాడు.

పూలజడ వేసుకోవాలన్న సీత కోరిక. సీత వయసుతోపాటు పెరుగుతూనే వుంది. అప్పుడప్పుడు పది మల్లెమొగ్గలు బంతికట్టుకుని జడలో పెట్టుకుంటోంది సీత. కాని తల్లిని పూలజడ వేయమని మాత్రం ఆ రోజు తరువాత ఎన్నడూ అడగలేదు. ఇప్పుడు మరీ ఖర్చు ఎక్కువయింది. తమ్ముడు పక్కూరి హైస్కూల్లో చేరాడు. వాడికి నెల నెలా జీతం కట్టాలట. దాంతో కోరికను గుండెలలోనే దాచుకుని అదనుకోసం ఎదురు చూస్తోంది.

ఓనాడు సీత మేనమామవచ్చి, రత్తమ్మతో ఏదో పెళ్ళిసంబంధం గురించి చెబుతున్నాడు. సీత తలుపుచాటునుంచి వింటోంది.

"కుర్రోడు దుక్కలా వుంటాడు, ట్రాక్టరు డ్రైవరు నెలకి ఓవంద దాకా సంపాదిత్తాడంట. తల్లిలేదు. తండ్రి ముసలోడు. ఇంట్లో ఆడదిక్కు

లేదు పాపం, పెళ్ళికాగానే కాపరానికి పంపెయ్యాలన్నారు. మనపక్కూరే అది రావాలన్నా నువ్వెళ్లాలన్నా నాలుగడుగులు నాకయితే బాగానచ్చింది సంబంధం" అన్నాడు రత్తమ్మ తమ్ముడు.

"నీకు నచ్చితే నాకూ నచ్చినట్టేరా" అంది రత్తమ్మ.

"పెళ్ళికొడుకు ఎలావుంటాడో అనుకుంది సీత. అంతలోనే "మావయ్యకు అన్నీ తెలుసులే. అంత బాగోనివాడిని చూడడు" అని సరిపెట్టుకుంది.

ముహూర్తం పెట్టారు. పెళ్ళింకా నాలుగు రోజులుంది. సీతని పెళ్ళికూతుర్ని చేశారు. మేనమామ కొత్త పరికిణీ, ఓణీ జాకెట్టుకుట్టించి పట్టుకొచ్చాడు. ఆ కొత్తబట్టల్లో కొత్త పెళ్ళికూతురు సీత మరీ అందంగా అగుపిస్తోంది. ఆ రోజున మాత్రం సీత పూలకోత కెళ్ళలేదు. మర్నాడు పొద్దున్నే సీత మొగ్గకోతకి బయలుదేరింది.

"ఎక్కడికే:" అంది రత్తమ్మ.

"మొగ్గకోతకి."

"కొత్త పెళ్ళికూతురువై కొత్తబట్టలతో పొలంమీద కెళ్ళకూడదమ్మా ?"

"ఎల్లుండికి మొగ్గడుగుదామనమ్మా!"

"ఔనమ్మా. నేమరిచేపోయాను? పోనీ ఎల్లిరా. ఎల్లి పెళ్ళికుదిరిందండి, పెళ్ళికి మీరూ రావాలి అని సెప్పి నాలుగు దోసిళ్ళ మొగ్గ పెట్టమనడుగు నీకు పూల జడకి సరిపోతై."

"అలాగేనమ్మా!" అంటూ లేడిపిల్లలా పరుగెత్తింది సీతతుల్లుతూ.

మల్లెతోట గట్టున పిల్లలతో కలసి నడుస్తుంటే, ఆ పిల్లలందరికంటె తనే పెదదానిలా అనిపించింది సీతకి. ఎందుకో సిగ్గుముంచుకొస్తోంది, షెడ్ దగ్గర చినకాపు మడత మంచంమీద పీఠం వేసుకుని

కూర్చున్నాడు, అతన్ని కన్నెత్తిచూడాలన్నా, పలకరించాలన్నా సిగ్గేసి పోతోంది సీతకి. పిల్లలంతా తోటలోకి దిగారు. కోత మొదలెట్టారు. సీత యింకా దిగలేదు. ఓణీ కొంగును పళ్ళతో పట్టి నములుతూ చినకాపు ముందే నిలబడింది.

"ఏమేటి కత? మరీ జోరుగా ముస్తాబయావ్" అన్నాడు.

"నాకు-నాకు పెళ్ళి"

"ఎప్పుడే?"

"యింక రెండ్రోజులుంది."

"అదా సంగతి. ఏట్రాయింత టింగురంగుగా వుందనుకున్నాను. ఇంతకు పెళ్ళికొడుకుదేవూరంట."

"ఏమో నాకుతెల్దు" అని తూనీగలా తోటలోకిదూకింది. మొగ్గల్ని చలాకీగా తుంపసాగింది.

వంగి మొగ్గల్ని ఎంతో నేర్పుగా మునివేళ్ళతో కోస్తూన్న సీతని ఒక క్షణంపాటు రెప్పార్పకుండా చూసాడు చినకాపు. ఎన్నడూ అల్లరి పిల్లలా అగుపంచే సీత ఆరోజు మెత్తగా, విరిసిన పువ్వులా అగుపించిందతనికి. కొత్త కొత్త కోరికలు వూరి మనసు తుమ్మెదల్లె 'ఝుం'మంటోంది. చేతికందిన ఖజానా యింకా రెండు రోజులలో పరారీ అయిపోతున్నట్లనిపించింది చినకాపుకి.

మధ్యాహ్నపు వేళకి మొగ్గకోత అయిపోయింది. పిల్లలంతా మొగ్గ పట్టుకొచ్చి చాపమీద దిమ్మరపోసారు. ఆఖరుకి సీతా దిమ్మరపోసింది. సీత ఆ రోజున చాలా మొగ్గకోసింది.

"మొగ్గ తుంపడంలో చేయి బాగా తిరిగినట్టుంది" అన్నాడు చినకాపు ఏదో ఒకటి అనాలన్న సరదాతో.

"ఆరేల్లబట్టి కోత్తుంటే తిరక్కేమవుద్దేటి?" అంది సీత ముఖం మీద పడుతున్న ముంగురులను వెనక్కినెడుతూ,

మొగ్గకోసిన పిల్లలందరికి దోసెడు దోసెడు మొగ్గలెట్టాడు. ఒక్కొక్క పిల్లే ఇంటిముఖం పట్టింది. సీతమాత్రం ఇంకా నిలబడే వుంది.

"ఏం ఇంకా నిలబడ్డావు!" అన్నట్టు చూసాడు చినకాపు.

"నా పెళ్లికి......" అని సిగ్గుపడింది సీత.

"నే రావాలా?'

"మాలాటోళ్ళింటికి మీలాటి పెద్దోళ్ళెందుకొత్తారేటి!"

"పిలిత్తే తెలుత్తాది? వత్తారో, రారో?"

"సరే అదీ సూత్తాను. ఆవలెల్లుండి పెళ్ళి-తప్పకుండా రావాలి."

"ఓ ?"

"మరినాకు పువ్వులుకావాలి. నేలని బొటనవేలుతో రాస్తూ అడిగింది సీత.

"యిరిసినకాడికి కోసుకో."

"అబ్బ మరిసిపోయి అన్నానులే, అదే మొగ్గకావాలి."

"దోసెడు వాళ్ళో పోసుకుని అప్పుడే పరగడపా?"

"ఇప్పుడు కాదు ఎల్లుండి సందాలకి."

"ఆయాల కోతకొత్తావుగ పెడతాలే."

"పెడతం అంటే మామూలు దోసెడుకాదు. నాలుగు దోసెల్దాకా పెట్టాలి. కావాలంటే డబ్బులిచ్చేత్తానులే. కాదంటె నేనీ వూరువదిలేసి ఎల్లిలోగా నాలుగు రోజులు వట్టినే కోసిపోతాను."

"అదిసరేలే అంత మొగ్గ ఎందుకే."

"పూలజడేసుకోవాలని..." జడని వేలికి మెలిపెడుతూ అంది సీత. మొగ్గ తొడిగిన సిగ్గు విరబూసినట్లు నవ్వేసింది.

"అదా సంగతి. వట్టి పూలజడేం కర్మే? నీకు కావాలంటే పూలజడ పూలజాకెట్టు, పూలచీర, పూలపానుపు-అన్నిటికి సరిపోయేటన్ని పూలు యిత్తాను సరేనా" అంటూ ఒళ్ళువిరుచుకి, ఒక్కడుగు ముందుకేసాడు, బుగ్గమీద చిటికవేయబోయేడు చినకాపు చనువుకొద్ది. చనువు రంకేవేస్తే సిగ్గు తుర్రుమంది.

వయసొచ్చిన సీతకి అప్పటికే సిగ్గుతో బుగ్గలెర్రబడ్డాయి. చేతికందకుండా పరుగెత్తింది. చినకాపు నవ్వుకుని, కోరికల్ని గుటకలూమింగి మొగ్గని బుట్టల కెత్తించడంలో మునిగిపోయాడు.

• • •

అనుకున్న ప్రకారం పెళ్ళి రేపనగానూ మొగ్గకోతకొచ్చింది సీత. అందరితోపాటు మొగ్గకోస్తోంది. మనసునిండా తీయని ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి కావడంతో చేయి ముందుకు జరగడంలేదు.

అంతలో షెడ్దగ్గరనుంచి "యీయాల కొత్త సిన్నమొగ్గలుకూడా వదలకుండా కోసెయ్యండే" అని అరిచాడు చినకాపు.

'నాకు మొగ్గలెట్టటం కోసమే సిన్నమొగ్గలుకూడా కోసెయ్యమంటున్నాడు చిన్నకాపు మంచోడు' అనుకుంది సీత. ఓసారి నడుంఎత్తకుండానే ఓరగా చూసింది అతన్ని. అదే సమయానికి అతనూ చూసాడు సీతని. కళ్ళుకలిసి నవ్వుకున్నాయి. యిద్దరూ చెరోరకంగాను అర్థంచేసుకున్నారు ఆ నవ్వుని.

మొగ్గకోత పూర్తయిన తరువాత అందరూ మొగ్గంతా చాపమీద దిమ్మరపోసారు. ఇంక చినకాపు వాళ్ళందరికి దోసెడు దోసెడు మొగ్గ పెట్టడమే తరవాయి.

"ఇయ్యాల మీకెవరికి మొగ్గలెట్టను. మీ అందరికి డబ్బులిత్తాలెంపి రేపు" అన్నాడు చినకాపు.

"నాకోసమే యీళ్ళందరికి మొగ్గలెట్టకుండా డబ్బులిత్తానంటున్నాడు ఓ బుట్టే యిత్తాడేమోనాకు" అనుకుంది సీత.

ఇంతలో రోజూ మొగ్గ బుట్టలకెత్తే నౌకర్లు కాకుండా ప్రెసిడెంటుగారి నౌకర్లు వచ్చారు.

"వచ్చారా! యీయాల్టి మొత్తం మొగ్గది. అట్టుకెళ్ళండి" అన్నాడు చినకాపు.

ప్రెసిడెంటుగారి నౌకర్లు మొత్తం మొగ్గని బుట్టలో కెత్తుతున్నారు

సీత నోరుమెదపకుండా చూస్తూ బొమ్మల్లెనుంచుంది. మొగ్గలిస్తానని దగాచేసినందుకు చినకాపుని చూస్తే వళ్ళుమండిపోతోంది సీతకి.

"ఎన్నాళ్ళబట్టో పువ్వుల జడకోసం సరదా పడ్డాను. అడిగినదానికంటే ఎక్కువ మొగ్గ యిత్తావని మాటిచ్చావు. చివరకిలా మాటతప్పుతావా? నువ్వు రెండు నాలికల మనిషివి" అని ముఖాన కొట్టినట్టు అనాలనుకుంది సీత.

వచ్చినవాళ్ళు పూల బుట్టలట్టుకుని వెళ్ళిపోయారు.

అంతలోనే చినకాపు సీతని చూసి 'అయ్యో? నీ సంగతే మరచిపోయానే. ఆతల ప్రెసిడెంటుగోరమ్మాయి పెళ్ళని కబురొచ్చింది వున్న మొగ్గంతా పంపమన్నారు పూలకోరు కడతారట. పూలమండపం కడతారట. మరికాదంటె బాగోదు సూడు. ఈ పాలెప్పుడేనా పట్టుకెడుదువుగానిలే' అని వెళ్ళిపోయాడు చినకాపు.

'మాలాంటోళ్ళ కిచ్చిన మాట తప్పినా పరవాలేదులే పెద్దోళ్ళకిచ్చిన మాట తప్పకు, మాదేవుంది? మా కోరికలదేవుంది? సిన్నోళ్ళం' అనుకుని సీత దిగాలుపడి, అడుగులో అడుగేసుకుంటూ యిల్లు చేరింది వట్టి చేతులతో.

పెళ్ళి జరిగిపోయింది. ఇవతల వీధిలో సీతపెళ్ళి. అవతల వీధిలో ప్రెసిడెంటు గారమ్మాయి పెళ్ళి ఒకే ముహూర్తానికి జరిగిపోయాయి. ఆరోజున ఊళ్ళోని పువ్వులన్నీ ప్రెసిడెంటు గారింటి కెళ్ళాయి,

సీత సాదాజడ వేసుకుంది. సాదాపల్లకీలో పెళ్ళికొడుకుతో కలసి ఎక్కింది యిరుగుపొరుగు పిల్లలు సరదాపడి, సీతముందు కొందరు పెళ్ళికొడుకుముందు కొందరు కూర్చున్నారు. పల్లకీముందు ఊళ్ళోని భజంత్రీలు, పిల్లసన్నాయి, డప్పులమేళం వున్నాయి. రెండు పెట్రోమాక్సు లైట్లు-పల్లకి దగ్గరొకటి డప్పులమేళం దగ్గరొకటి పట్టుకుని వాళ్ళవాళ్ళే నిలబడ్డారు.

పెళ్ళి జరుగుతున్నా మనసులోని తీరనికోరిక, జరిగిన అవమానం సీత మనసుని కుమ్మరిపురుగులా దొలుస్తూనే వున్నాయి.

వాళ్ళ వీధంతా వూరేగి పెద్ద వీధిలోకి ఊరేగింపు మళ్ళబోతోంది. 'ఆగండి యీతసెట్టు కాలుత్తున్నారు' అని అరిచారెవరో.

ఆ వీధిలోని జనం అంతా-అంతరాత్రివేళా బయటకు వచ్చి కాలుస్తూన్న బాణాసంచాని చూస్తూ నిలబడ్డారు. వీధిలో కర్రాటలకి కట్టేసున్న దూడలు బెదురుతూవుంటే, రైతులు దూడలదగ్గర నిలబడి వాటిని దువ్వుతూ బాణాసంచా కాల్పుని చూస్తున్నారు.

పల్లకీ ఎత్తుకున్న ఓ చాకలి 'పెసిడెంటుగోరూరేగింపనుకుంటానురా సానా పొడుగుండాదిరా ఇప్పుడప్పుడే తెవద్దు' అన్నాడు వెనకవాడితో.

వెనకవాడు పల్లకీ బొంగుకి బోటుకర్రని బోటుపెట్టి చెవిలో చుట్ట తీసి తాపీగా ముట్టించాడు.

బాణాసంచా ముందుకు కదిలింది. తరువాత డప్పులమేళం-ఢంకా నౌబత్‌ఖానా-సామర్లకోట బ్యాండ్ మేళం-సాయబు డోలుసన్నాయి-దాని తరువాత మురమండ బోగంమేళం.

మేళంముందు చినకాపు అగుపించాడు సీతకి.

'కలోళ్ళ పెళ్ళిలో కలోడు, నా పెళ్ళికెందుకొత్తాడులే' అనుకుంది సీత.

తరువాత పూలకారు అగుపించింది. ఊరేగింపు పొడవునా అటో పది, యిటో పది గాస్‌లైట్లనెత్తుకుని తూర్పుజనం. ఆ వెలుగులో పూలతో నిండిన పూలకారులో ప్రెసిడెంటుగారమ్మాయి సూటువేసుకుని బొమ్మలా కూర్చున్న పెళ్ళికొడుకు అగుపించారు సీతకి.

'కారులో వాళ్ళెక్కడా అగుపించకుండా పూలతోరణాలు కప్పేసారు కారుని' అనుకుంది సీత.

'ప్రెసిడెంటు గారమ్మాయి ఎక్కినకారు కాబట్టి, పాత యినపముక్క అయినా పూలతో నిండిపోయింది. నేను మనిషినే అయినా ఆ కారు పాళం చేయలేదు. నేను పువ్వుల్లో పుట్టాను. పువ్వులమధ్య పెరిగాను, తిరిగాను. రోజూ పువ్వులు కోసాను. అందుకే పూలకికూడ నే వెగటైపోయాను. పూలకి నోచుకోలేదు. పూలజడ కోరిక తీరనేలేదు. లేనోల్లయింట్లో పుట్టిన మనిషికంటె వున్నోల్లెక్కినకారే నయం. యిదెన్నాళ్ళో?' అనుకుంది సీత.

ప్రెసిడెంటుగారమ్మాయి వూరేగింపు వెళ్ళిపోయింది. వీధంతా చీకటయిపోయింది. అంతా మసగ మసగ్గా అగుపించింది సీతకి – కొంతసేపు, తరువాత తన వూరేగింపు వెలుగులోనే అంతనీ స్పష్టంగా చూడగలిగింది.

కథా నిలయం
శ్రీకాకుళం